క్లుప్తంగా

పారిశుధ్య పనులు పరిశీలించాలి

నింద్ర: వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ వార్డు సభ్యులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ అన్నారు. సోమ వారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంక్‌లో నీటిని నిలిపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయాలన్నారు. ప్రతిఒక్కరు గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వినతులపై ప్రత్యేక దృష్టి


వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. ఈ సందర్భంగా మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 17 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఇందులో మ్యుటేషన్ 09, ఆటస్థలం 01, దారిసమస్య 02, భూసర్వే 01, పట్టాదారు పాస్‌పుస్తకం 04 వచ్చినట్లు తెలిపారు. వచ్చిన సమస్యలలో ఐదు సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించామన్నారు. మిగిలినవాటిని దశలవారీగా పరిష్కరిస్తామన్నారు.

గృహ నిర్మాణాలు పరిశీలన

నింద్ర: మండలంలో గృహ నిర్మాణ పనులు, మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ గృహనిర్మాణాలను ఏఈ శ్రీధర్‌రాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. పూర్తి చేసిన వారికి బిల్లులు సకాలంలో అందిస్తామన్నారు. పనులు పూర్తి కాని వారితో చర్చించి మాట్లాడి పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు పెద్దపీట


జేసీబీతో రోడ్లు శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ వరదమ్మ

శ్రీరంగరాజపురం: తయ్యూరు పంచాయతీలో పరిశుభ్రతకు పేద్ద పీట వేస్తునట్లు స్థానిక సర్పంచ్ వరదమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ వ్యాప్తంగా రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లచెట్లను, పేడదిబ్బలను జేసీబీ సాయంతో శుభ్రపరిచారు. పంచాయతీ వ్యాప్తంగా గ్రామాల్లో బ్లీచింగ్ పిచికారీ చేపట్టారు. తడిపొడి చెత్తలను చెత్తకుప్పల్లోనే వేయాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రథసప్తమికి ముమ్మరంగా ఏర్పాట్లు

నగరి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధీనంలో ఉన్న స్థానిక శ్రీ భూదేవి శ్రీదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించనున్న రథసప్తమి ఆర్జిత కల్యాణోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం ఏర్పాట్లు ముమ్మరంగా నిర్వహించారు. ఆలయంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి వెంకటరమణ తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు స్వామివారికి, దేవేరులకు తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో ప్రసాద వినియోగం చేస్తామన్నారు. కల్యాణోత్సవ ఉభయదారులకు ఆలయం తరఫున ప్రసాదాలు అందిస్తామన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి

పాలసముద్రం: మండల పరిధిలో ప్రతి సోమవారం రోజు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపి, పరిష్కారం చేయాలని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెవెన్యూ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల పరిధిలోని ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు స్పందించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కులం, ఆదాయం సర్టిఫికెట్లు సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్ గణేష్, ఎంఆర్ఐ దేవి, వీఆర్‌ఓ తంగరాజ్, శ్రీనివాసులు, రమేష్, రమణయ్య, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

చామంతి భళా.. ధర డీలా



జిల్లాలో ఈ ఏడాది చామంతి పంట రైతులకు నష్టాలను మిగిల్చింది. దిగుబడులు బాగా ఉన్నప్పటికీ ధర లేక ఈ పరిస్థితి తలెత్తింది. సాగులో పెట్టుబడులు అధికమైనప్పటికీ ధరలు ఉంటాయనే ఆశతో సాగు చేశారు. దసరా సమయంలో ధరలు ఉన్నప్పటికీ చాలా చోట్ల దిగుబడులు రాలేదు. ఆ తర్వాత కార్తీక మాసం, సంక్రాంతి సీజన్‌లో కూడా ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయని పలువురు రైతులు తెలిపారు.

– కార్వేటినగరం


పెనుమూరు మండలంలో కోతకు సిద్ధంగా చామంతి పూలు

- ఆశాజనకంగా చామంతి దిగుబడి
- మార్కెట్‌లో పడిపోయిన రేట్లు
- పెట్టుబడి రావడం కష్టమే
- తోటల్లోనే పూలు వదిలేస్తున్న వైనం
- ఆందోళనలో చామంతి రైతులు

జిల్లాలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలలో పూల సాగు విస్తారంగా ఉంది. ఈ ఏడాది రబీలో 5 వేల ఎకరాల్లో చామంతి సాగు చేశారు. ఇందులో కుప్పం, రామకుప్పం, శాంతిపురం, పెనుమూరు మండలాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టారు. ఎక్కువ మంది రైతులు చాందిని, పేపర్ ఎల్లో, పేపర్ వైట్, బుల్లెట్, సెంటిల్లా తదితర రకాలు వేశారు. చామంతి సాగు చేసిన మూడు నెలలకు దిగుబడి చేతికి వస్తుంది. తోటల్లో దిగుబడులు ప్రారంభమైనప్పటి నుంచి ధరలు బాగా ఉంటే రైతులు ఆశించిన మేరా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. కానీ పండుగల సీజన్లో మాత్రమే ధరలు ఉండడం, తరువాత పడి పోవడం చామంతి రైతులకు నష్టాలు, కష్టాలు మిగిల్చాయి.

ధరలు తగ్గుముఖం

సంక్రాంతి పోగానే మార్కెట్‌లో చామంతి ధరలు పడిపోయాయి. సంక్రాంతి వరకు కిలో రూ.150 నుంచి రూ.200 వరకు పలికింది. తరువాత ధరలు తగ్గుముఖం పట్టాయి. జూన్, జూలైలలో సాగు చేసిన తోటల్లో ముందుగానే పూలు కోతకు వచ్చాయి. అప్పట్లో మార్కెట్‌లో ధరలు ఒక రకంగా ఉండడంతో రైతులకు కొంత ఆదాయం వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు కిలో రూ.30 ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరలు ఇలాగే ఉంటే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

కొనుగోళ్లకు మొగ్గు చూపని వ్యాపారులు

చామంతికి మార్కెట్‌లో ధరలు తగ్గడంతో వ్యాపారులు కూడా కొనుగోళ్లకు మొగ్గు చూపడం లేదు. ధరలు ఉన్నప్పుడు వ్యాపారులు తోటల వద్దకు వచ్చి పూలు కొనుగోలు చేసి వాహనాల్లో తరలించేవారు. ప్రస్తుతం డిమాండ్ లేకపోవడంతో రైతులే బయట ప్రాంతాల మార్కెట్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం తోటలలో కోత కోసిన పూలను చెన్నై, బెంగళూరు మార్కెట్లకు తరలిస్తున్నారు. అక్కడ ధర ఒక రకంగా ఉంటే అంతో ఇంతో వస్తుందని, రేటు తగ్గితే మాత్రం ఖర్చులు కూడా రావని రైతులు పేర్కొంటున్నారు.

తోటల్లోనే వదిలేస్తున్నారు

ధరలు లేక పోవడంతో చాలామంది రైతులు తోటల్లో పూలను కోసేందుకు ఆసక్తి చూపడం లేదు. పూలు కోసేందుకు కూలి, రవాణా ఖర్చులు కూడా రావనే ఉద్దేశంతో కోత కోయడం లేదు. సాగు కోసం వేలకు వేలు పెట్టుబడులు పెట్టి దిగుబడులు వచ్చే సమయంలో ధరలు తగ్గడంతో రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ కష్టమంతా నేలపాలు అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేటు కోసం ఎదురు చూపులు

మార్కెట్‌లో ధరలు పెరుగుతాయని రైతులు ఎదురు చూస్తున్నారు. వారం రోజులపాటు తోటలో పూలు ఉంటాయని అంతలోపు ధరలు రాకపోతే ఉన్న రేటుకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కిలో రూ.20 నుంచి రూ. 30కి మాత్రమే ధరలు ఉన్నాయి.

ఎకరాకు లక్షపైగా పెట్టుబడి

చామంతి సాగులో రైతులకు పెట్టుబడులు భారంగా మారాయి. ఎకరా సాగుకు లక్ష రూపాయలకు పైనే పెట్టుబడులు అవుతున్నాయి. పంట దిగుబడి బాగా రావాలనే ఉద్దేశంతో చాలా మంది నారును బయట ప్రాంతాల్లోని నర్సరీల నుంచి తెచ్చి సాగు చేస్తున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరిగింది. ఎరువులు, సేద్యం సాగు ఖర్చులు కలిపి లక్ష రూపాయల వరకు వస్తోంది.

మూడు ఎకరాల్లో సాగు చేశా



నేను మూడు ఎకరాలలో చామంతి సాగు చేశా. ఇందుకు రూ.3లక్షల పెట్టుబడి పెట్టా. దిగుబడులు వచ్చే సమయానికి ధరలు తగ్గి పోయాయి. తోటలో చామంతి పూలు కోతకు వచ్చినా ధరలు లేక పోవడంతో కోయడం లేదు. ధరలు వస్తాయనే ఆశతో ఎదురు చూస్తున్నా.

–వీరభద్ర, చామంతి రైతు, గాంధీపురం, పెనుమూరు మండలం

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు



మార్కెట్‌లో ధరలు పూర్తిగా తగ్గాయి. పది రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ధరల కోసం వేచిచూస్తున్నాం. 2 ఎకరాల సాగుకు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

–వాసు, చామంతి రైతు, తిమ్మరాజుకండ్రిగ, పెనుమూరు మండలం

గోకులం షెడ్లను తప్పనిసరిగా నిర్మించాలి


గోకులం షెడ్ల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ నీలకంఠశ్వేరరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): ప్రభుత్వం అందించిన గోకులం షెడ్లను తప్పనిసరిగా నిర్మించాలని ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గోకులం షెడ్లు లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పశు సంపదను అభివృద్ధి చేయడంలో భాగంగా ప్రభుత్వం మినీ గోకులం షెడ్లు అందించిందని తెలిపారు. నిధులను వృథా చేయకుండా తప్పనిసరిగా పాడి రైతులు షెడ్లు నిర్మాణం చేపట్టి వినియోగంలో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం అందించిన కొలమానాలు తగ్గకుండా షెడ్లు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ గుణశేఖర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


పైపు వేస్తున్న సర్పంచ్ గాలి మహేష్‌బాబు

పాలసముద్రం: మండలంలోని జూదగిరి ఎర్రమంది గ్రామంలో తాగునీటి బోరులోకి వర్షపు నీరు పోయి చాలా రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన సర్పంచ్ సోమవారం గ్రామానికి ప్రభుత్వం వేసిన బోరు మోటారును మరమ్మతు చేయించారు. సర్పంచ్ గాలి మహేష్‌బాబు బోరు మోటారుకి అదనపు పైప్ బిగించి, గ్రామానికి తాగునీరు సరఫరా చేశారు. చాలా రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు ప్రస్తుతం బోరు మోటారులో నీరు రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాబ్ మేళాలో 16 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ నిర్వహించిన జాబ్ మేళాలో 16 మంది ఎంపికయ్యారు. కాల్ మన్, అడేల ఎలక్ట్రికల్స్, డైకిన్ కంపెనీలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ వేణు గోపాల్ తెలియజేశారు. 20 మంది అభ్యర్థులు హాజరు కాగా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ, నైపుణ్యం కలిగిన 16 మందిని ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ డిగ్రీతోపాటు నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చే మార్పులను గమనించి వాటిపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని కోరారు. జీతంతోపాటు వచ్చే అనుభవం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ పంకజ, ఐక్యూ కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ రేవతి. జేకేసీ మెంటార్ లాల్‌బాషా, కంపెనీల ప్రతినిధులు హరీష్, దొరబాబు, ఆయేషా, పార్థసారధి పాల్గొన్నారు.



కేశవపురం వద్ద ప్రమాదకర మలుపులు

ప్రమాదాల మలుపులు

విజయపురం: మండలంలోని విజయపురం–కనకమ్మసత్రం వెళ్లే రోడ్డువెంట ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించపోవడంతో పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అంతే కాకుండా మలుపు వద్ద ఎలాంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ స్థితిగతులను మెరుగు చేద్దాం

- డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్


వీధి వ్యాపారులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ

నగరి: పట్టణ పరిధిలో ట్రాఫిక్‌ను మెరుగు పరచడానికి ప్రత్యేక పథకరచన చేసినట్లు డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ తెలిపారు. టవర్‌క్లాక్ జంక్షన్ లోని వీధి వ్యాపారులు, తోపుడు బండ్లు నడిపేవారు, పూల దుకాణాలు పెట్టుకున్నవారికి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ స్థితిగతులను మెరుగు పరచడం, రోడ్డు ప్రమాదాలను నిరోధించడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పట్టణ ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, రోడ్లపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే తోపుడు బండ్లవారు రోడ్డు మార్జిన్‌కు లోపల బండ్లు పెట్టుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండు ప్రాంగణం, ఏకాంబరకుప్పం రైల్వేగేట్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఏ మాత్రం అతిక్రమించినా జరిమానాలు తప్పవన్నారు. చెరుకు లోడ్డు ట్రాక్టర్ల రాత్రి 9 గంటలపైనే రోడ్డుపై వెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. అందరూ సహకరిస్తే ట్రాఫిక్‌లో మార్పులు తీసుకువచ్చి ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చూద్దామన్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

రూ.28,368 ఉపాధి నిధుల రికవరీ


ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న పీడీ రవికుమార్

శ్రీరంగరాజపురం: మండలంలో 2023–24 సంవత్సరానికి ఉపాధి హామీలో చేపట్టిన పనుల్లో సోమవారం నిర్వహించిన బహిరంగ ఆడిట్ సమావేశంలో రూ.28,368 రికవరీ చేసినట్లు జిల్లా పీడీ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ పథకం ద్వారా పాడి రైతుల సౌకర్యం కోసం గోకులం షెడ్లు నిర్మిస్తున్నామని అన్నారు. అవినీతికి పాల్పడినట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. 2023–2024 సంవత్సరం ఉపాధిహామీలో మండలంలోని 11కోట్ల 68 లక్షల 81వేల 146 రూపాయల పనులకు రూ.28,368 రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏపీఓ చంద్రశేఖర్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాబోధనపై ప్రత్యేక తనిఖీలు


వీకేఆర్ పురంలో విద్యార్థుల నైపుణ్యం పరిశీలిస్తున్న ఎంఈఓ

నగరి: ఉపాధ్యాయుల విద్యాబోధనపై ఎంఈఓ శ్రీదేవి సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వీకేఆర్ పురం పాఠశాలను తనిఖీ చేసిన ఆమె విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. హిందీ భాషలో విద్యార్థుల నైపుణ్యం కనబరచడంతో పాఠశాలలో సింగిల్ టీచర్ ఉన్నా పిల్లలకు అత్యుత్తమ బోధన అందించినందుకు హిందీ టీచర్‌ను ప్రశంసించారు. అనంతరం తడుకుపేట దళితవాడ పాఠశాలను తనిఖీ చేసిన ఆమె విద్యార్థులు తెలుగు చదవడం, రాయడం సక్రమంగా చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు ఇది పునరావృతం కాకూడదని హెచ్చరించారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ల ఆవిష్కరణలో ఎమ్మార్పీఎస్ నేతలు

నగరి: మున్సిపల్ పరిధి కాకవేడులో ఎమ్మార్పీఎస్ నేతలు మండల ఇంచార్జ్ కార్తీక్ మాదిగ ఆధ్వర్యంలో లక్షల డప్పులు–వేల గొంతులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వావిళ్ల శివయ్య మాదిగ, సీనియర్ నాయకులు కుమారస్వామి మాదిగ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరిగే 'లక్షల డప్పు లు – వేల గొంతులు' మహా సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని, ప్రతి గ్రామం నుంచి హాజరు కావాలని కోరారు. ప్రతి ఒక్కరూ సంకన డప్పు వేసుకొని మహా సాంస్కృతిక ప్రదర్శనకు విచ్చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు మునిహరి, శ్రీనివాసులు, వెంకటరత్నం, రఘు, వెంకటేశులు లోకనాథం, పాండు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారుడికి ఉత్తమ పురస్కారం


ఉత్తమ పురస్కారాన్ని స్వీకరిస్తున్న రామకృష్ణారెడ్డి

వెదురుకుప్పం: మొండవెంగనపల్లె గ్రామానికి చెందిన జానపద కళాకారుడు ఎస్.రామకృష్ణారెడ్డికి తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఉత్తమ పురస్కారం లభించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ రవీంద్రభారతి మినీ ఆడిటోరియంలో ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, లలిత కళాభిరామ పీఠం, సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 20వ వార్షిక పురస్కార ప్రధానోత్సవంలో అందజేశారు. రామకృష్ణారెడ్డి చెక్కల భజన, కోలాట భజన, పండరి భజన, జానపద గురువుగా సుప్రసిద్ధుడై సుమారు 20కి పైగా కళా బృందాలను తమారు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే బ్రహ్మోత్సవాలు, వార్షిక ఉత్సవాల్లో ఈ కళా బృందాలు పాల్గొని అందరి వద్ద మన్ననలు పొందినట్లు చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కళామతల్లికి అందించి సేవలకు గుర్తింపుగా రామకృష్ణారెడ్డికి జిల్లాలోనే గుర్తింపు దక్కడం గర్వకారణమని యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఈశ్వర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. తెలంగాణలో జరిగిన పురస్కార సభలో ద్రవిడ విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ పీడీ క్రిష్ణ పాల్గొన్నారు. గ్రామస్తులు రామకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు.

అధునాతన పరికరాలతో విద్యాబోధన


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్‌డే

కార్వేటినగరం: అధునాతన సాంకేతిక పరికరాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా బోధనలు కొనసాగుతుందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో ఓపెన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధునాతనమైన సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. ఎన్ఎస్ఎస్ విభాగం, లైబ్రరీ, వ్యాయామశాల, ఉచిత ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన కంప్యూటర్ స్మార్ట్ బోర్డులు, విశాలమైన తరగతి గదులు, చదువుతోపాటు ఉద్యోగ సాధనకు అవసరమైన మెళకువలు కల్పించే జేకేసీ విభాగం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన వెంటనే ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు సిద్ధపడాలన్నారు. ఈ క్రమంలో భాగంగా ప్రిన్సిపల్ కళాశాలలోని అన్ని విభాగాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలసుబ్రమణ్యం ఆచారి, ధనుంజయరెడ్డి, సీఎస్ లత, హరిబాబు, కార్తీక్, బాబు, సరిత, భార్గవి, ఈశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి


మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ గిరిజ తెలిపారు. సోమవారం ఎల్ఎన్ పురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పప్పు, కూరగాయలు, గుడ్లు సక్రమంగా పెట్టాలని తెలిపారు. వండక ముందే బియ్యం మంచి నీటితో కడిగిన తరువాత అన్నం చేయాలన్నారు. రసం, సాంబార్‌లకు అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. ముఖ్యంగా ప్రదానోపాధ్యాయుడు విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో త్వరగా పెట్టాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు చేసిన భోజనాన్ని రుచి చూశారు. ఆమె వెంట హెచ్ఎం లత పాల్గొన్నారు.

దళితుల ప్రాణాలంటే అంత అలుసా?


ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: చిత్తూరు–పుత్తూరు జాతీయరహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఫోన్‌లో డీఎంఅండ్‌హెచ్ఓకు సూచించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న గంగాధరనెల్లూరు నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మరణించిన వెంకటేష్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆయన కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రమాదం జరిగి రెండు గంటలవుతున్నా ఇంతవరకు 108 వాహనం రాకపోవడం దారుణం అన్నారు. అనంతరం ఆమె తన సొంతంగా రెండు వాహనాలను ఏర్పాటు చేసి క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సూచించారు.